ఆరాత్రి— రెడ్డిబాబుకు— రంగడి రక్తం వరదల్లో తనయిల్లూ, పిల్లలూ కొట్టుకు పోతున్నట్టు పీడకల రావటంతో పిచ్చికేకలు వేసినట్టు ఎవరికీ తెలియదు.

"నా పొలంరా.... నా భూమిరా "అన్న భీముని అరుపులే రావుగారి గుండెల్లో మెరుపులై.... ఉరుములై భయపెట్టడంతో రాత్రి రావుగారికి నిద్ర కరువయిందని.... ఎవ్వరికీ తెలియదు.

కాని కుక్కతోక వంకర అని అందరికీ తెలుసు.

సెక్స్ సినిమాకి వెళ్లిన రాత్రి!

ఆర్. యస్. మూర్తి.

లీలామహల్లో ఏదో గూఢచారి సినిమా వచ్చింది. అందులో నటించిన యువతీ మణుల ఊరించే గుండెల్నీ, కవ్వించే పిరుదుల్నీ, ఉద్రేకపర్చే ఉన్మత్తపర్చే అంగాల్నీ, ఉత్తేజకరమైన పోజుల్లో— బహిరంగస్థలాల్లో ప్రదర్శించి— ఆ సినిమాని తప్పక తిలకించి, ఆనందించమని సినిమావాళ్లు మరీమరీ ఉద్బోధించేరు ప్రజల్ని! రాజబాబు స్నేహితులంతా సినిమా చూసొచ్చి, "గొప్ప సెక్సీగావుంది గురూ పిక్చరు, మిస్సవకు సుమీ!" అని అతన్ని మరీమరీ హెచ్చరించేరు. సెక్సుకి సంబంధించిన విషయాల్లో ఆసక్తిగాని, అనుభవంగానీ లేకపోయినప్పటికీ, 'పోనీ— స్పై థ్రిల్లర్ కదా. సెన్సేషనల్ ఫైటింగ్సూ, హేర్రేజింగ్ బాక్సింగ్సూ అవీ ఉంటాయికదా, ఓసారి చూసొస్తే మునిగిపోయిందేవి' టన్న ఉద్దేశ్యంతో ఆఖరోజు రాత్రి రెండో ఆటకి ఒంటరిగా వెళ్ళేడు రాజబాబు.

* * *

....బీచొడ్డున మెత్తటి ఇసుకలో, ఆహ్లాదకరమైన వెన్నెల్లో, ఊరించే కన్నులు గలది, ఉబ్బొంగిన స్తనములుగలది అయిన ఒక అందాలరాసి అందంగా, అర్థనగ్నంగా పడుకుని వుంటుంది. అనాచ్ఛాదితకాయుడు, బలాఢ్యుడు అపురూప సౌందర్యవంతుడూ అయిన యువకుడొకడు ఆ యువతిని ఆక్రమించుకుని, ఒకచెయ్యి ఆమె మెడక్రింద,

794

మరోచేయి రొమ్ములమీద వేసి ఆమె అధరసుధా మకరందాన్ని ఆస్వాదిస్తూ ఉంటాడు. ఆ యువతి ఆ యువకుణ్ణి దగ్గిరిసా ఇంకా దగ్గిరిసా తీసుకుంటూ, హృదయానికి గాఢంగా హత్తుకుంటూ,– కళ్ళలో ఆ సమయంలో కలిగే హావభావాల్ని ప్రదర్శిస్తూ ఉంటుంది. ఇంతలో ముద్దుచప్పుడు మ్యూజిక్కుతో ఆ నటీనటు లిద్దరిపేర్లు తెర మీదకు వస్తాయి ఆ సినిమా అలా ప్రారంభమవుతుంది

ఆ ఓపెనింగ్ సీను చూడగానే హాల్లో ప్రేక్షకు లందరిలాగానే రాజబాబుకి కూడా నరాలు ఝల్లు మన్నాయి. కోరికలు ఖస్సుమన్నాయి. ఆ సీనొక్కటి అలాటిదైతే ఏ చిక్కూ లేకపోను. కాని ఆ సినిమా మొదట్నించి చివరిదాకా అలాటి దృశ్యాలతోనే నడుస్తుంది. ముద్దులు, కౌగలింతలు, తాగడాలు, తన్నుకోడాలు, పెదాలు కరుచుకోడాలు, బట్టలు విప్పుకోడాలు, ఆడాళ్లని ఎత్తుకోపడాలు, జలక్రీడలు, జఘనాల తాటింపులు, పయోధరాల పిదిలింపులూ, నవ్వులు, నగ్ననృత్యాలు,– కార్లలో, పడవల్లో, విమానాల్లో సృష్టికార్యాన్ని సూచించే ఫీట్సూ, మాడర్న్ వెపన్స్‌తో యుద్ధాలూ, అందులో హీరో ప్రదర్శించే సాహసాలూ, వారి వారి రహస్యావయవాల విలాసాలు, విక్షేపాలు, వెకిలిచేష్టలు. రేప్సు, మర్డర్సు ఇలాంటి ఉత్తేజకరమైన దృశ్యాలతో మొత్తంమ్మీద ఆ సినిమాహాలు హాలంతట్నీ ఊపేసింది. యావత్ప్రేక్షక జనానీకాన్ని కవ్వించి, ఉద్రూతలూగించి, వేడెక్కించి తహతహలాడించి ఉన్మత్తుల్ని చేసింది. ఇవన్నిచూసి సరదాపట్టలేక కొంతమంది విద్యార్థులు చప్పట్లుచరిచి, ఈలలు వేసేరు. రాజబాబు మాత్రం మదన వికారంతో భగభగా మండిపోయేడు. నరాలు బిగుసుకుపోయేయి. రక్తం హీటెక్కి పోటెక్కింది. ఆ రోజువరకు అతనిలో నిద్రాణమైవున్న యవ్వన వాంఛలు పడగవిప్పి బుసకొట్టేయి. అతనికి తెరమీదపడి హీరోయిన్ని అమాంతంగా బిగియార కౌగలించుకుని మరీ నలిపిపారేద్దా మన్పించింది తన ఎదుటిసీట్లో కూర్చున్న సోల్జర్‌పేట దొరసాన్ని పదిరూపాయలిస్తాను బీచ్‌కివస్తావా అని అడిగేయాలన్పించింది. తనవెనకసీట్లో కూర్చున్న సోడాకళ్లద్దాలవాడి కళ్ళద్దాలు లాక్కుని వాడి ఎత్తుగుండెల కర్రిపెళ్లాన్ని, రావణాసురుడు సీతని ఎత్తుకుపోయినట్టు ఎత్తుకుపోవాలన్పించింది. ఆమూల సింధీబట్టల షాపువాడిపక్కన సినిమాస్టారులా సింగారించుకుని కూర్చున్నవాడి వయసుమళ్ళిన దిబ్బపెళ్లాన్ని ఆక్షణమే బీచికి బరబరా లాక్కుపోయి చిత్ర విచిత్రంగా చిత్రహింసలు పెట్టాలన్పించింది. సింధీదానికి నాలుగు సీట్లవతల కూర్చున్న లిప్‌స్టిక్‌పెదాల బెంగాలీ కాలేజీగర్ల్‌తో ఆ హాల్లోనే, ఆసీట్లమధ్యే, ఆక్షణమే పడుకోవాలన్పించింది. ఆ సినిమా మొత్తమ్మీద ఒక్కడైలాగైనా రాజబాబుకి అర్థం

795

కాలేదు. కాని ఆ సినిమా మాత్రం మరోమారు చూడాలన్పించింది. ఒక్కసారికాదు లక్షసార్లు చూడా న్పించింది. అంతమంచి సినిమాని అంత తక్కువరోజులే ఆడించినందుకు సినిమాహాలు వాడిమీద అతనికి విపరీతమైన కోపం వచ్చింది.

సినిమా అయిపోయేక రాజబాబు సీట్లమధ్య దారికడ్డంగా నిలబడ్డాడు. సినిమా హాల్లోంచి బైటికివచ్చే జనం గత్యంతరం లేక అతన్ని ఒరుసుకుని వెళ్తున్నారు. స్త్రీల తాలూకు గుండ్రిటి భుజాలు ఒంటికి తగులుతున్నాయి. సిగలోని పూలదండలు నాసికాగ్రాన్ని చుంబిస్తున్నాయి. పాలిండ్ల పార్శ్వభాగాలు హృదయాన్ని పలకరిస్తున్నాయి. ఎగిరిపడే పైటలు శరీరానికి గిలిగింతలు పెడ్తున్నాయి. ఆ అనుభూతుల పరంపరకి చలించిపోతూ, పు కించిపోతూ సోడా కళ్ళద్దాలవాడి కర్రిపెళ్లాం—దగ్గరకు వచ్చేవరకు ఆలాగే నిలబడ్డాడు రాజబాబు. ఆమెని దగ్గరకు రానిచ్చి ఆవిడముందు నడవడం ప్రారంభించేడు. ముందున్న జనం నెమ్మదిగా నడుస్తున్నారు. వెనుకనున్న జనం ముందుకు తోసేస్తున్నారు. రాజబాబు ఐడియా ఫలించింది. సోడాకళ్ళద్దాల కర్రిపెళ్లాం ఎత్తుగుండెలు వీపుకి తగుల్తున్నాయి. మెత్తటి స్త్రీ రొమ్ములు; కమ్మటి సెంటువాసన, రాజబాబుకి మైకం కమ్ముతోంది. శరీరం తేలిపోతోంది. ఏదో మధురమైన ఆవేశం. వెనక్కి తిరిగి ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకుని, కౌగిట్లో బిగించి, ముద్దుల్తో ముంచెత్తేసి, పిప్పి పిప్పిచేసేసి ఆమెలో ఐక్యమైపోవాలనే ఉధృతరసికావేశం. సినిమా హాలుబైటికి వచ్చేసరికి అతనింక ఆవేశాన్ని ఏమాత్రం అణుచుకోలేకపోయేడు. మేల్కొన్న మృగవాంఛని, క్షణక్షణానికి విజృంభించే రిరంసని అదుపులో పెట్టలేకపోయేడు. దేనికేనా తెగించీడానికి సిద్ధపడిపోయేడు.— 'ఏమైతే అవనీ; నలుగురూ తిడితే తిట్టనీ— కొడితే కొట్టనీ— మొహమ్మీద ఉమ్మితే, ఉమ్మనీ!— పరువూ ప్రతిష్ఠా మంటకలిస్తే కలవనీ!!— అనే మొండిధైర్యంతో— మదన వికారంతో వెనక్కి తిరిగి ఎత్తుగుండెల మయూరాక్షి వక్షోజాలమీద కామం పేరుకుని మండుతున్న చేతులువేసి రెప్పపాటుకాలంలో జనప్రవాహంలో కలిసిపోయి, మాయమైపోయేడు. తొలి సాహసచర్య నిరపాయంగా నెరవేరడంచేత అతను మరింత ధైర్యం పుంజుకుని మరో ఇద్దరు ముగ్గురు విరిబోడుల పీనపయోధరాలమీద కోరికల కాట్లువేసేడు. వీలుచూసుకుని సింధీ దాని నున్నటి పిరుదులమీద కూడా ఓమారు చేతులు పడనిచ్చేడు. బెంగాలీ అమ్మాయికి భుజం తగిలించేడు. సోల్జర్ పేట దొరసాని నడుమ్మీద చేతులు వేసేడు. ఆ జనసమ్మర్దంలో— ఇళ్ళకు చేరుకునే హడావుడిలో వాళ్ళెవరూ అతన్ని అంతగా పట్టించుకోలేదు.

796

సినిమా హాలుకి కొంచెం దూరంలో ఒక కాకాహోటలుంది. ఆ కాకాహోటలు పక్కనే ఒకచిన్న కిళ్ళీకొట్టుంది. కిళ్ళీకొట్టుకి కొంచెం ఎడంగా ఒక ఎలక్ట్రిక్ స్తంభం వుంది. స్తంభం పక్కన మున్సిపాల్టీవారి గుడ్డిదీపం చాటుచేసుకుని ఓ వారవనిత నిలబడుంది. ఆమె సన్నగావున్నా పుష్టిగావుంది. అప్సరస కాకపోయినా అందంగానే వుంది. మొహంలో కళవుంది, ఆమె కళ్లలో కైపుంది. ఆమె కట్టుకున్న తెల్లచీర రమ్యంగావుంది. ఆమె తొడుక్కున్న నల్లజాకెట్టు నిండుగావుంది.

ఆమెను చూడగానే రాజబాబు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. కోరిక గోదావరి వరదలాగా చెలరేగి, పోటెక్కి, పరవళ్లుతొక్కింది. నరనరాల్లోనూ పొంగి పొర్లి ప్రవహించింది. కామోద్దీపితాలైన అతని కళ్ళకి ఆ 'రంకులాడి' తన వాంఛని చల్లార్చటానికి భగవంతుడు దయతోపంపిన దివ్యస్త్రీలా కనిపించింది.

రాజబాబుకి ఆ రోజుదాకా వక్కపొడి తప్పించి చెప్పుకోదగ్గ వ్యసనాలేవీలేవు. సిగరెట్లనీ, సినిమాలనీ దురలవాట్లులేవు. ఆడపిల్లల పిచ్చి మచ్చుకయినాలేదు. చాలా మంది యువకుల్ని బాధించినట్టు కామవాంఛలూ, కామోద్రేకాలూ— ఊహలూ అతన్నెప్పుడూ బాధించలేదు. వారకాంతల గురించి, వారివల్ల సంక్రమించే భయంకర రోగాల గురించి అతని స్నేహితులు వెకిలిగా మాట్లాడుకుంటూ వుంటే అతను చాలాసార్లు విన్నాడు. కాని వారకాంతల్తో కూడాలనే కోరిక అతనికెప్పుడూ కలగలేదు, కలలు కనలేదు, తాపత్రియపడలేదు. ఆరోజుదాకా అతని మనసంత నిర్మలంగానూ, నిష్కల్మషంగానూ ఉందంటే అందుక్కారణం— సెక్సు సినిమాలు, సెక్సు పుస్తకాల ప్రభావం అతనిమీద పడకపోవడమేనని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పొచ్చు అతనారోజుదాకా అతనారోజుచూసిన సినిమాలాటి సినిమాల్ని చూడలేదు, చలం సాహిత్యంతోటి, మధు పుస్తకాలతోటి, ఛీపమెరికన్ లిటరేచర్తోటి, అతనికస్సలు పరిచయంలేదు. ఖరీదైన బూతుబొమ్మల పుస్తకాలుంటాయని అతనెప్పుడూ వినలేదు వాటికోసం జనం విరగబడి ఛస్తారని తెల్సుకోలేదు. రాజబాబారోజుదాకా నూటికి నూరుపాళ్ళు అస్కలిత బ్రహ్మచారన్చెప్పొచ్చు. అతనారోజుదాకా తన చదువు, పుస్తకాలు తప్పిస్తే మరో లోకంలేదని అనుకుంటూండేవాడని పందెం కట్టి చెప్పొచ్చు.

కాని అతనారోజు చూసిన సినిమా అతన్లో మరుగుపడివున్న కోరికల విషసర్పాన్ని నాగస్వరం ఊది మేల్కొల్పింది. ఆరోజుదాకా అనుభవంలోకి రానట్టి అనుభూతుల్నీ, ఆవేశపుటుద్రేకాల్ని రేపి రెచ్చగొట్టింది. అతనికి నిషాఎక్కించి ఉన్మత్తుణ్ణి

చేసింది. అంచేత ఆరోజు రాత్రి ఆడదైతే చాలుననుకునేటంత హీట్లో ఉన్నాడతను. ప్రాణాలుపోయినా సరే కోరిక తీర్చుకోవాలనేటంత ఆవేశంతో ఉన్నాడతను. కోరిక తీర్చుకోకపోతే ప్రాణాలు పోతాయేమో నన్పించేటంత అవస్థలో ఉన్నాడతను.

అట్టి పరిస్థితుల్లో ఆ వేశ్యాలలామ కళ్లముందు ప్రత్యక్షమవడంతో అతని జ్వరం నూటపది డిగ్రీలకి పెరిగిపోయింది. అతని రక్తం ఆగలేక తొందరచేసింది. దహించుకుపోయింది అతనికి కళ్లు బైర్లుకమ్ముతున్నట్టు— కాళ్లు, చేతులు తేలిపోతున్నట్టు అనిపించింది. కోరికతీర్చుకోవడ మొకటే అతనికి ఉత్తమమార్గంగా కనిపించింది. బాధ చల్లార్చుకోవడ మొకటే అతనికి అత్యవసర విషయంగా పరిణమించింది. కోరికతీర్చుకోడం కూడా పెద్దకష్టమేంవీ కాదిప్పుడు.

కోరిక చల్లార్చే వెచ్చటి ఆయుధం కళ్ళముందే వుంది.
కోరి రమ్మంటే కౌగిట్లోకివచ్చి వాలుతుంది.
కావాలంటే—
ఒక్క కనుసైగ—
ఒక్క కంటిపిలుపు—
జేబులో అయిదు రూపాయల నోటు—
ఉంటే చాలు.
అంతా సెటిలయిపోతుంది.
వెచ్చటి సుఖాన్ని రిక్షాలో వాటేసుకుని,
మెత్తటి మల్లెపూల చెండుని ఆఘ్రాణిస్తూ,
తియ్యటి అధరాల మధువుల్ని ఆస్వాదిస్తూ,
ఉబ్బు కెరటాల అంచులమీద పరుగులుతీస్తూ,
కళ్లుమూసి తెరిచేలోగా బీచికి పోవచ్చు.
రాజబాబు గుండెలు గుబగుబ లాడేయి.
కోరికలు గుర్రాలై పరుగులు తీసేయి.
తను "ఊ." అంటే చాలు స్వర్గద్వారాల కవాటాలవే తెరుచుకుంటాయి
స్వర్గసుఖాల రాసులు ఒడిలోకొస్తాయి.
బీచొడ్డుని మెత్తటిసుకలో—
చిక్కగా కుదిసే వెన్నెల్లో—

798

గిలిగింతలు పెట్టే చల్లగాల్లో—
విరిగిపడే కెరటాల పాటల హోరులో—
ఒంటరిగా తనూ—
తన ఒడిలో ఆమే—
రాజబాబుకి ఓపెనింగ్ సీను గుర్తుకువచ్చింది.
ఒళ్ళు జలదరించింది.
తను "ఊ" అంటే చాలు. అంతా ఏర్పాటైపోతుంది. క్షణంలో బీచికి పోవచ్చు—
బీచొడ్డున సంబరం చెయ్యొచ్చు. కాని— ముందర తను 'ఊ' అనాలి.
"ఊఁ" అన్దమా ? మాన్దమా ?!
రాజబాబుకి "ఊఁ" అనాలనే వుంది.
కాని అన్దానికి భయంగా వుంది ధైర్యం చాలకుండా వుంది.
సందేహాలు, సందేహాలు— అన్నీ సన్దేహాలే ! భయాలే !!
'రోగాలేవన్నా అంటుకుంటాయేమో'—
కుర్రాడివి కదా ! నీకిదేం పోయేకాలం అంటుందేమో—
అందరి ముందు తన్నవమానిస్తుందేమో—
తీరా మోసి బీచికివెళ్లేక చేతకాపోకతే నవ్వుతుందేమో— వెక్కిరిస్తుందేమో—
రౌడీలచేత తన్నించి,— వాచీ రింగులూ వొల్చుకుపోతుందేమో—
పోలీసులు పట్టుకుని లాకప్పులో పెట్టేస్తారేమో—
రిక్షాలో వెళ్తుంటే తెల్సినవాళ్ళెవరైనా చూస్తారేమో—
రేపొద్దున్న ఆస్పత్రికి మూడోనంబరు వార్డుకివెళ్తే ఇంజక్షన్ ఇస్తారో—
ఇవ్వరో— అక్కడ అంతా వెటకారం చేస్తారేమో—
స్నేహితులు ఎవరికైనా తెలిస్తే 'ముండ జబ్బుల' మహరాజని ఏడిపిస్తారేమో—
రాజబాబు మనసులోని భావాల్ని ఆమె ఎలా పసిగట్టిందో, రెండడుగులు
ముందుకివేసి "కావాలా" అని అతినెమ్మదిగా అర్థమయేట్లుగా అడిగింది.
రాజబాబు గుండెలు దడ దడ దడ దడ లాడేయి.

'తొందరగా ఏదో వొకటి తేల్చుకోవాలి— ఆమె పిలుపుని అంగీకరించడమో.
తిరస్కరించడమో— ఏదో ఒకటి— అటో, ఇటో— వాంఛని చల్లార్చుకోకపోడమో—
చల్లార్చుకోడమో— ఏదో ఒకటి తేల్చుకోవాలి— త్వరగా, త్వరగా—'

రాజబాబు నడక మందగించింది.
రాజబాబు బుర్ర మిషన్లా పనిచేస్తోంది.
'ఏదో ఒకటి వేగిరం తేల్చుకోవాలి– ఇటో, అటో– త్వరగా తేల్చుకోవాలి–
అతని అంతరాళంలో తుఫాను, యుద్ధం–
ఒకపక్క వాంఛ, మరోపక్క భయం–
పోరాటం, సంగ్రామం–

'ఏమయ్యా రాజబాబూ! ఏదో ఒకటి తేల్చుకోవయ్యా!! ఆడదాన్లా అలా భయపడతావేమయ్యా! సాహసించవయ్యా!!!
చేజిక్కిన అదృష్టాన్ని జారవిడువకయ్యా!

' విడువను గాక విడువను, ప్రాణాలు పోయినా సరే, తిరుగులేని రోగాలు తగులుకున్నా సరే– ఈ ఛాన్సు వదలనంటే వదలను '

రాజబాబు మగసిరి పుంజుకున్నాడు. సాహసం చెయ్యడానికి పూనుకున్నాడు.
"ఏయ్, రిక్షా! ఇలారా...!"

రిక్షా వచ్చింది... రాజబాబుకోసం కాదు సినిమా హాల్లో అతని పక్క సీట్లో కూచొని సినిమా చూస్తున్నంతసేపూ కారాకిళ్లీతో మిళితమైన సారాకంపుతో ముక్కుపుటాలు అదరగొట్టిన బండపెదాల బొండాంగాడి కోసం. రాజబాబు వాంఛ చల్లార్చడానికి భగవంతుడు దయతోపంపిన దివిజకాంత కాస్తా, బొండాంగాడి కౌగిట్లో వాలి కనుమరుగైపోయింది

రాజబాబు ఉస్సురుమన్నాడు బొండాంగాడిని చంపేద్దామన్నంత కోపం వచ్చిందతనికి. చేతికి చిక్కిన అదృష్టాన్ని మరెవడో తెంపకాయకొట్టి లాక్కున్నట్టనిపించిందతనికి. కసితో అతని హృదయం రగుల్కుపోయింది. బొండాంగాడిని బూతులు తిట్టుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ, చేజారిపోయిన స్వర్గానికి చింతిస్తూ ఇంటిదారి పట్టేడు రాజబాబు.

తడితడిగా వెన్నెల కాస్తోంది ఉండుండి చల్లటి పిల్లతిమ్మెరలు వీస్తున్నాయి. వాంఛ, ఆరని వాంఛ, తీరని వాంఛ– అతని నరాల్ని కాల్చేస్తోంది. అతని మనోనేత్రాలముందు నగ్నస్త్రీలు– నృత్యం చేస్తున్నారు. వివస్త్రలు గావించబడిన రమణీమణులతో రాజబాబు క్రీడిస్తున్నాడు. ఆహ్హా! ఈ ఊహాలోకం ఎంత కమ్మగా, తియ్యగా, పసందుగా ఉంది! ..

800

ఎవరో జంట ఒకరినొకరు కౌగిల్లో బంధించుకుని రిక్షాలో ఇంటికికాబోలు వెళ్తున్నారు. రాజబాబు రిక్షాలో ఆ స్త్రీ పక్కన భర్తస్థానంలో తన్నూహించుకుని లొట్టలు వేసేడు. ఎవరో ఇద్దరు యువతులు, తెలుగు సినిమానించి కాబోలు ఆడుకుంటూ, పాడుకుంటూ, అరుచుకుంటూ బూతులు తిట్టుకుంటూవస్తున్నారు. వాళ్ళిద్దరూ ఝూమ్మని వయసులో వుండి, బాబాస్వీట్ స్టాల్లో అప్పుడే తయారు చేసిపెట్టిన తాజా మిఠాయి ఉండల్లా ఉన్నారు. వారిరువురినీ ఏ రహస్య ప్రదేశానికైనా లాక్కుపోయి ఇద్దర్నీ ఒకేసారి అనుభవించాలనిపించింది రాజబాబుకి.

రోడ్డుపక్క గోడలమీద వాల్‌పోస్టర్లు అతికించబడివున్నాయి. ఓచోట ఓ వాల్ పోస్టర్లో రీటాహేవర్త్ చాలా అందంగా ఉంది. రాజబాబు రోడ్డుపక్కగా వెళ్ళి ఆమె బొమ్మలమీద చేతులు వేసేడు. 'ఈ క్షణంలో ఈ బొమ్మకు ప్రాణాలొస్తే ఎంత బావుణ్ను!' అనుకున్నాడు.

నూకరాజు కిళ్ళీకొట్టుకి దగ్గర్లో ఉన్న బస్సుస్టాపులో, పక్కనేవున్న రోడ్డుదీపం కాంతిలో, ఓ బీదగుంట వంటరిగా పడుకుని దొర్లుతోంది. ఏదో జానపద చిత్రాల్లోని బూతుపాటలు ఎలుగెత్తి పాడుతోంది. అది బీదదే అయినా అందంగా ఉంది. చిన్నదే అయినా చీరలుకట్టే వయసుదాన్లా వుంది. మాసిన దుస్తులే అయినా మనిషి శుభ్రంగా, సబ్బేసి కడిగినట్టుగా ఉంది. జీవితంలో ఎప్పుడూ దుఃఖమూ, దరిద్రమూ తప్పిస్తే సుఖమెఁరగనిదాన్లా వుంది. 'దీని చేతిలో అయిదు రూపాయలు పెట్టి, వీధికిపోయి వాంఛ తీర్చుకుంటేనో!' అనిపించింది రాజబాబుకి. "ఇలాంటి బీదగుంటలు డబ్బిస్తానంటే ఎంతకేనా తెగిస్తారు" అని తనని తాను ఉత్సాహపరుచుకున్నాడు. 'ఇది తొడగడమయితే పరికిణీ జాకెట్టు తొడిగిందిగాని చూడ్డానికి టక్కులటమారిలా కనబడుతోంది' అనుకుంటూ బస్సుస్టాపుని సమీపించేడు. ఆపిల్ల వెల్లకితలా పడుకుని "ఇంద, ఇంద తీసుకో"— అంటూ ఓ బూతుపాటని పరమానందంగా పాడుకుంటోంది.

"ఏయ్, నీపేరేఁవిఁటి!" అని అడిగేడు రాజబాబు.

ఆపిల్ల తన సంగీతాన్ని ఆపి, రాజబాబు కళ్ళల్లోకి బెదురుబెదురుగా చూసింది. ఆకల్తో ఉన్నపులిని ఆవుదూడ చూసినట్టు చూసింది.

"నీ పేరేఁవిఁటి?"

"మా లచ్మి"

801

"పేరు బావుందే! నాతో బీచికివస్తావా... అయిదు రూపాయలిస్తాను" అన్నాడు రాజబాబు సిగ్గుతో చచ్చిపోతూ. అతనిమాటలు అతనికే వెకిలిగా. వికృతంగా. భయంకరంగా ధ్వనించేయి. ఎందుకేనా మంచిదన్చెప్పి. అతను ఐదురూపాయినోట్లు చేత్తో పట్టుకుని ఆడించేడు.

ఆపిల్ల రాజబాబు మొహంవేపు కాసేపు వింతగాచూసి, "అమ్మా. ఈడుసూడే!" అంటూ గావుకేక పెట్టింది.

బస్సుస్టాపు వెనక పాడుపడి, కూలిపోతూ, ఇవాళా రేపా అన్నట్టున్న ముష్టింట్లోంచి, "ఏటే మాలచ్మీ" అన్న స్త్రీకంఠం వినవచ్చింది.

"ఈ గొల్లిగాడు సూడే!...."

రాజబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తేయి. రాజబాబు కాళ్ళు నాటంతట అవే సమయోచితంగా పనిచేసేయి. అతను పుంజాలు తెంచుకుని పరిగెట్టడం మొదలెట్టేడు. చెత్తకుండీలో ఎంగిలాకులకోసం గాలిస్తున్న రెండు ఊరకుక్కలు భౌభౌమంటూ అతన్ని వెంబడించేయి. 'అమ్మ గుంటముండ ఎంత పన్చేసిండీ,' అనుకుంటూ అతను మరింత పిక్కబలం చూపెట్టాడు. అలా పరిగెట్టి బంగారయ్య ఇంటిదాకా వచ్చేసేడు. బంగారయ్య ఇంటిదగ్గరికి వచ్చేక ఓమాటు ఆగి, వెనక్కి తిరిగిచూసి, ఎవరూ వెంట తరమటం లేదని నిర్ధారించుకుని, నెమ్మదిగా నడవటం మొదలెట్టేడు. బంగారయ్య రాజబాబు వాళ్ళ ఎదిరింటి వాళ్ళ చాకలిమనిషి. బంగారయ్య పెళ్లాం సత్యవతి ఎర్రగా, పసుగా, బంగారపు బొమ్మలా ఉంటుంది. దానికోసం రాజబాబు వీధిలోని కుర్రాళ్ళంతా పడి ఛస్తారు.

చాకలి దంపతులిద్దరూ ఆరుబైట నులకమంచమ్మీద ఒకరినొకరు కౌగలించుకుని పడుకున్నారు చాకలివాడి కాళ్లు చాకలిదాని మీద వున్నాయి. చాకల్దాని పెదాలు చాకలివాడి బుగ్గలమీద వున్నాయి. చాకల్దాని రొమ్ములకి చాకలివాడి ఛాతియే ఆచ్ఛాదన. వాళ్ళిద్దరూ ఒళ్ళుమర్చి నిద్రిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తూవుంటే రాజబాబు కాళ్ళు కదలడానికి ఇష్టపళ్లేదు. 'నేనే ఆ చాకలివాడినైపోతే ఎంత బావుణ్ణు!' అనుకున్నాడు రాజబాబు నులకమంచానికి కొంచెం ఎడంగా ఒక తాటిచెట్టుంది. తాటిచెట్టు చాటున నిలబడి చాకల్దాన్ని పరిశీలనగా చూసేడు అతను. వెన్నెలపడి చాకల్దాన్ని నున్నటి చెక్కిళ్లు అద్దాల్లా మెరుస్తున్నాయి. ఆచ్ఛాదనలేని పాలిండ్లు లీలగా, మాయగా. మనో

802

హరంగా కనబడుతున్నాయి. రాజబాబు రక్తం సెగలుకక్కింది. చాకలివాణ్ని మంచ మీంచి తోసేసి చాకల్దానితో పడుకోవాలన్నంత ఆవేశం కలిగింది.

రాజబాబు ఇంటికి చేరుకునేసరికి ఒంటిగంటన్నరయింది. రాజబాబు వదినగారు- పద్మావతీదేవి ఒళ్లుమరిచి నిద్రపోతోంది వాకిట్లో.

రాజబాబుకి వదినంటే ఎంతోభయం. భక్తి. అభిమానం, అనురాగం, గౌరవం. అతడామెను మాతృసమానురాలిగా భావిస్తాడు. ఆరాధిస్తాడు. ఆమెకూడా అతన్ని కన్నకొడుకులానే చూసుకుంటుంది. ఆమెకు పిల్లాజెల్లాలేరు. రాజబాబు అన్న డాక్టరు. అతను పెళ్ళయేక సంవత్సరమైనా తిరక్కుండానే పై చదువులకి అమెరికా వెళ్ళేడు. వెళ్ళి రెండేళ్ళయింది. ఇంకో ఆర్నెల్లో తిరిగి రాకపోతే సంవత్సరం పట్టొచ్చు. విమెన్సు కాలేజీలో టీచరుగా పన్చేస్తున్న వదినకి సాయంగా వుంటూ- మెన్సు కాలేజీలో బియ్యే చదువుకుంటున్నాడు రాజబాబు.

"వదినా! వదినా!!" తలుపు తట్టేడు రాజబాబు.

ఆమె నిద్రమత్తులో తూలుకుంటూ వచ్చి తలుపు తీసింది. ఒంగుని తలుపు తీస్తూంటే ఆమెపైట జారింది. పల్చటి జాకెట్టులోంచి బలిష్టమైన పాలిండ్లు తొంగి చూసేయి. అప్రయత్నంగా రాజబాబు చూపులటు మరిలేయి. అతని కళ్లు చెదిరేయి. అతని శరీరంలో విద్యుత్తుప్రవహించింది. పరిస్థితుల ప్రభావంగా మాతృభావం మరుగు పడి, అతన్లో ఉద్రేకం-పశుత్వం రెచ్చగొట్టబడ్డాయి.

'ఛీ, ఛీ! ఎంత పతనం!' రాజబాబు అంతరాత్మ ఘోషించింది.

అతను నేరం చేసినవాడిలా దృక్కులు మరల్చుకుని, తలొంచుకుని తన గదిలోకివెళ్ళి దుస్తులు మార్చుకున్నాడు. దుస్తులు మార్చుకుంటూ వుండగా పద్మావతి అతని గదిలోకివచ్చి, "సినిమా ఎలావుంది రాజూ?" అనడిగింది. తను దుస్తులు మార్చుకుంటూ వుండగా వదిన తనగదిలోకి రావడం అదే మొదటిసారి కాకపోయి నప్పటికీ అదోలా అన్పించింది రాజబాబుకి, పైగా ఆమెతన్నే గుచ్చిగుచ్చి చూస్తున్నట్టుకూడా అతనికి అనుమానం కలిగింది.

"ఓమాదిరిగా ఉంది ఒదినా" అన్నాడతను- చాలాబాగుందన్చెప్పడానికి సిగ్గుపడిపోయి.

803

"నువ్వు భోంచేస్తావా? చపాతీలు తింటావా రాజూ?"అని అడిగింది వదిన,

"ఇప్పుడేంవద్దు వదినా!" అన్నాడు రాజబాబు మరోసారి ఆమె పాలిండ్లని చూడాలనే కోరికను బలవంతంగా అణుచుకుంటూ.

"అదేవిటి! ఎందుకొద్దు? సాయంత్రం కూడా ఏం తినలేదుకదా! పదపద! ఇన్ని చపాతీలు తిను. చపాతీలు తిని, కాస్త పాలుతాగి పడుక్కో. ఏం?" అంటూ బలవంతం చేసిందావిడ.

"అక్కర్లేదు వదినా!" మొండికేసేడు రాజబాబు.

"ఆకలదేవేస్తుంది రెండే రెండు చపాతీలు తిను పోనీ"

"అస్సలాకల్లేదు"

"నామాట విను!"

"తినాలని లేదు"

"ఐతే నీ ఇష్టం. పోనీ పాలివ్వనా?"

వదినని సంతోష పెట్టడంకోసం ఈసారి "సరే" అన్నాడు రాజబాబు. వదిన తెచ్చిన పాలగ్లాసు అందుకుంటూ శిఖరాల్లా మొనతేలి ఉన్న ఆమె స్తనద్వయాన్ని చూడాలనే కోరికను నిగ్రహించుకో లేకపోయేడు రాజబాబు.

కోరికతో వణికిపోతూ వాకిట్లో వదినపక్క మరో మంచమ్మీద పడుకున్నాడు రాజబాబు. క్షణక్షణానికి అతని వాంఛ లావాలా విజృంభిస్తున్నది. వదినమీదికి పరుగులు తీస్తున్న మనసుకి కళ్ళెం వెయ్యడం కష్టంగావుంది. అంతరాత్మ చేసే హెచ్చరికల్ని యవ్వనం లక్ష్యం చెయ్యకుండా వుంది. మదమెక్కిన యవ్వనాన్ని యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం గొలుసులు వేసి బంధించలేకుండా వుంది. నరాలు అంతకంతకూ బిగుసుకుపోతున్నాయి. శరీరం అంతకంతకూ వేడెక్కిపోతోంది. రక్తం అంతకంతకూ పోటెక్కుతోంది. రక్తనాళాలు బద్దలైపోతాయా అన్పిస్తోంది.

"ఒదినఅంటే కన్నతల్లికాదు. రక్తం పంచుకు పుట్టిన సోదరికాదు. ఒదిన్ని కామించడం పెద్ద తప్పేంవీంకాదు. వయసులో ఉన్న కుర్రాళ్ళకి ఇలాటి కోరికలు కలగడం అసహజం కాదు" అంటూ యవ్వనం రాజబాబుకి ధైర్యం చెప్తోంది. లొంగ దీసుకుంటోంది. యవ్వనం పిలుపుని రాజబాబు కాదనలేకపోయేడు. అంతరాత్మ మెడ పట్టుకుని గెంటేసి హృదయ కవాటాల్ని మూసీసేడు. యవ్వన కాంక్షతో ఒదినవేపు చూసేడు. ఈసారి ఆమె వక్షోజాల్ని ధైర్యంగా సర్వేచేసేడు.

804

రాజబాబుకి తను చూసిన సినిమాలోని ఒకదృశ్యం గుర్తుకి వచ్చింది. అందులో హీరోయిన్ నీటుగా ముస్తాబై మంచమ్మీద పడుక్కుని వుంటుంది. ఇంతలో హీరో రాకెట్టులా దూసుకువచ్చి దబ్బున ఆమెమీద పడిపోతాడు. వాళ్ళిద్దరూ ఒకరినొకరు కౌగిళ్ళలో బంధించుకుని, మంచంమీద దొర్లిదొర్లి, రక్తాలు కారేలా పెదాలు కొరికేసుకుని కొరికేసుకుని; ఒకరిదుస్తు లొకరు చింపేసుకుని ఒకళ్ళనొకళ్లు నలిపేసుకుని నలిపేసుకుని చిత్తుగా ఒకటయిపోతారు.

రాజబాబుకి వదిన్ని అలా చెయ్యాలన్పించింది. అలా నలిపేయాలన్పించింది.

కాని అలాచేస్తే వదిన ఏమంటుందో? తిడుతుందా? కొడుతుందా? అసహ్యించుకుంటుందా? ద్వేషిస్తుందా? "రాజూ నువ్విలా చేస్తావని కల్లోకూడా అనుకోలేదు. ఎందుకిలా చేసేవ్ రాజూ!" అంటూ మూలుగుతుందా? బాధపడుతుందా? ఏడుస్తుందా? మొత్తుకుంటుందా? తనతో మాట్లాడ్డం మానేస్తుందా? అన్నయ్యకి ఉత్తరం రాస్తుందా?

కాదు. వదిన అవేవీ చెయ్యదు. వదినకి మాత్రం కోరికలుండవా? ఆమె మాత్రం మానవ మాత్రురాలుకాదా? మానవ సహజమైన ఉద్రేకాలు ఆమెకు మాత్రం ఉండవా? వదినకసలు మొదట్నించి తనంటే కొంత ఇదే, ఏ ఇదీ లేకపోతే తనమీద ఎందుకింత ఆపేక్ష చూపిస్తుంది? తనకి చిన్నపిల్లాడిలా ముద్దులుచేసి అన్నమెందుకు తినిపిస్తుంది? తనని అప్పుడప్పుడు అక్కున చేర్చుకుని, "రాజూ నీకెవరంటే ఎక్కువిష్టం?" అని చిన్నపిల్లల్ని అడిగినట్టు ఎందుకడుగుతుంది— ఏ ఇదీ లేకపోతే?.... ఒకసారి తనని కళ్ళుమూసుకోమని తనుండగానే దుస్తులు మార్చుకుంది. మరి దీనికి అర్థమేవిటి? తనేం చిన్నవాడా— చితకవాడా? ఇరవైయేళ్లు దాటేయి. మీసాలుకూడా వచ్చేసేయికదా! ఎన్నిసార్లు తనని కౌగిలించుకుని డాబామీద పడుక్కోలేదు వదిన. ఇన్నాళ్ళూ తనెప్పుడూ వీటిగురించి ఆలోచించలేదు. అంతగా పట్టించుకోలేదు కాని ఇప్పుడు, తల్చుకుంటే అన్పిస్తోంది—— వదిన మనసులో ఏకోరికా లేకుండానే ఇవన్నీ చేసిందా అనీ— వదినక్కూడా తనలాటి కోరికలేవుంటాయి. తనలాంటి సంకోచాలే వుంటాయి. తను చొరవతీసుకుంటే, పిలిస్తే, సాహసిస్తే వదిన ఎంతమాత్రం అడ్డు చెప్పదు— అనుకున్నాడు రాజబాబు.

వదినని చూస్తున్నకొద్దీ రాజబాబు వాంఛ తీవ్రమౌతోంది. రక్తం పరవళ్లు తొక్కుతోంది. అణువణువూ దహించుకుపోతోంది. రాజబాబు తలగడాని గుండెలకి హత్తుకున్నాడు. 'వదినా! వదినా!!' అంటూ తలగడని ముద్దుపెట్టుకున్నాడు.

805

సినిమాలో దృశ్యాలన్నీ అతని కళ్ళముందు తిరుగుతున్నాయి. అతని ఆవేశానికి ఇంధనాన్ని సమకూరుస్తున్నాయి. కళ్లద్దాలవాడు, కరీంపెళ్లాం గుండెలు, రీటాహేవర్త్ ఉరోజాల సొబగులు, బెంగాలీగాల్ నడుం వొంపులు, చాకల్దాని సోయగాల సొంపులు, సింధీదాని పిరుదుల బెళుకులూ, హరిజన యువతుల వయ్యారపు తళుకులూ, భోగందాని కాటుకకళ్లలోని గూడుకట్టుకున్న కోరికల సౌందర్యాలూ— అవన్నీ అతని మనోనేత్రాలముందు మెదిలి అతన్ని వదినమీదకి సాహసం చెయ్యడానికి పురికొల్పుతున్నాయి. మదనుడి బాణాల గాయాల తాపానికి తట్టుకోవడం చివరకు దుర్భరమై— 'ఈ క్షణం హరిమీద గిరిపడినా, గిరిమీద హరిపడినా, భూనభోంతరాలు బద్దలైనా సరే నేను వదిన్ని అనుభవించి తీరాల్సిందే!' అని దృఢంగా నిశ్చయించుకుని ఆమె నిద్రిస్తున్న మంచంవేపు నడిచేడు.

పద్మావతి ప్రశాంతంగా నిద్రపోతోంది. ఆమె కళ్లు— కాగి, బరువెక్కి వాలిపోయినట్లు అందంగా, మనోహరంగా వున్నాయి. ఆమె చెక్కిళ్లు పాలుకారుతున్నాయి. ఆమె పెదాలు తేనెలోవూరి ఉబ్బిన గులాబీరేకుల్లా వున్నాయి. సమున్నత వక్షం సవాల్ చేస్తున్నట్లుంది.

వదినను సమీపించేసరికి రాజబాబు ధైర్యం కాస్తా రబ్బరు బంతిలోంచి గాలి తీసేసినట్లు బుస్సుమంది. అతని వాంఛమాత్రం మరో పదిరెట్లు అధికమైంది.

ఆ పెదాలతేనె జుర్రాలి. ఆ శరీరాన్ని పువ్వున్నలిపివేసినట్లు నలిపేయాలి, ముద్దుల వర్షంతో ముంచెత్తాలి— రాజబాబు ఉద్రేకానికి అవధుల్లేకుండా వుంది. కాని సాహసం చెయ్యడానికి ధైర్యం చాలకుండా వుంది.

రాజబాబు వెనక్కి తిరిగొచ్చి మంచమ్మీద కూర్చుని వదినవేపు కన్నార్పకుండా చూసేడు. కటకటాల్లోంచి ప్రసరించే వెన్నెల కాంతిలో ఆవిడ అహల్యాదేవిలా కనిపించింది. రాజబాబుకి స్పార్కులా చక్కటి ఆలోచన తట్టింది. వదిన దుప్పటి కప్పుకోలేదు కదా! తనే వెళ్ళి దుప్పటికప్పితే! ఆమెని తాకడానికిదే మంచి ఛాన్సు! ఒకవేళ లేచినా దుప్పటి కప్పుతున్నానన్చెప్పి తప్పించుకోవచ్చు. వ్వాట్ ఎ బ్రిలియెంట్ ఐడియా! రాజబాబు నెమ్మదిగా అతినెమ్మదిగా ఆమె వొంటిమీద దుప్పటికప్పేడు ధైర్యంగా, కాని అతి మృదువుగా సమున్నత వక్షాన్ని స్పృశించేడు. తృష్ణతో నెమ్మదిగా నిమిరేడు. వాంఛ సర్పంలా అతన్ని పెనవేస్తోంది. శరీరం వశం తప్పిపోతోంది. మండుతున్న పెదాలతో అతను వదినమీదకు ఒంగేడు.

806

ఇంతలో ఆమె నెమ్మదిగా కదిలింది.

అతను వడివడిగా కొట్టుకుంటున్న గుండెల్తో గాభరాగా లేచి ఒక్కంగలో తన మంచాన్ని చేరుకున్నాడు. ఊపిరి బిగపట్టి నిద్రపోతున్నవాడిలా నటించేడు. రాజబాబు భయపడ్డట్టు ఆమె లేవలేదు. ఇట్నుంచి అటు తిరిగి పడుకుంది.

రాజబాబు తన పిరికితనానికి తనే సిగ్గుపడ్డాడు. 'ఛీ ఛీ ఈసారి ఆరునూరయినా, నూరారైనా వదిన్ని కౌగిట్లో బిగించుకోవాలి!!' అని నిశ్చయించుకున్నాడు. మరింక ముందువెనకా ఆలోచించకుండా వెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె పిరుదుల్ని తాకేడు. శరీరం వొంపుల్ని వెతికేడు మెడచుట్టూ చెయ్యివేసేడు. జాకెట్టులోకి చేతులు పోనిచ్చేడు.

"ఎవరది? రాజా!" అంటూ పద్మావతి దిగ్గునలేచింది.

రాజబాబు గడగడలాడిపోయేడు. అతనికి ముచ్చెమటలు పోసేసేయి. తనగుండె ఆగిపోలేదుకదా అనిపించిందతనికి చెవుల్లోంచి వెచ్చటి ఆవిర్లు కమ్ముకున్నాయి. బుర్ర పన్చేయడం మానేసింది. గుడ్లు మిటకరిస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయేడు.

"ఏవిఁటి కావాలి రాజా!" పైట సర్దుకుంటూ అడిగింది పద్మావతి.

రాజబాబుకి అనుకోకుండా ఆపద్బాంధవిలా చక్కటి అబద్ధం నోటికివచ్చేసింది.

"వంటింటి తాళాలు కావాలి వదినా!"

పద్మావతి వంటింటి తాళాలెప్పుడూ తన పరుపుకిందో, తలగడాకిందో పెట్టుకుంటుంది.

"తాళాలెందుకు? మంచినీళ్లు కావాలా రాజా! మంచంకింద ఉంటాయి తీసుకో" అంటూ తనేతీసి– రాజబాబు చేతికి మంచినీళ్ళ గ్లాసందించింది.

రాజబాబు గుప్‌చప్‌గా మంచినీళ్ళు తాగి వచ్చి తన మంచమ్మీద వాలిపోయేడు ఉస్సురుమంటూ.

పద్మావతి కూడా ఓ గ్లాసుడు మంచితీర్థం పుచ్చుకుని– బాత్రూంకి వెళ్ళొచ్చి, ఓమారు పైటా, కుచ్చెళ్లు సవరించుకుని లైటార్పి పడుకోబోతూ– రాజబాబు వేపు తిరిగి– "నీకు దుప్పటి అవీ ఉన్నాయా రాజా! ఇంకో తలగడా ఇమ్మన్నావా?" అడిగింది.

"ఇంకేం అక్కర్లేదు వదినా!" అని పైకని మనసులో మాత్రం 'నీ సౌందర్యం కావాలి వదినా!' అనుకున్నాడు రాజబాబు.

807

ఆరాత్రి ప్రయత్నాన్ని అంతటితో విరమించుకుని తీరని వాంఛతో నిద్రపట్టక పక్కమీద ఇటూ- అటూ పొర్లి— తెల్లవారుఝామున ఏ నాలుగ్గంటలకో నిద్రాదేవి కటాక్షించి కౌగిట్లోకి తీసుకోగా ఆదమర్చి నిద్రించిన రాజబాబు మర్నాడుదయం పది గంటలకిగానీ లేవలేదు.

రాజబాబుకి నిద్రలేవగానే ఎంచేతనో పెద్ద తుఫానువచ్చి వెలిసినట్లనిపించింది. తన హృదయాన్ని పట్టిపీడించిన పెనుభూతమేదో ఒదిలిపెట్టి నట్లనిపించింది. అతనికి రాత్రి జరిగిన సంఘటనలన్నీ ఒకటొకటీ గుర్తుకువచ్చేయి. తన ఊహలూ, ఉద్రేకాలూ తల్చుకుంటే సిగ్గువేసింది. తల్లిలాటి వదినకోసం, తను చేసిన ప్రయత్నం— పడ్డపాట్లు తల్చుకుని అతను పశ్చాత్తాపంతో కుమిలిపోయేడు. కళ్ళల్లో నీరు తిరిగింది, తలగడాలో తలదాచుకుని వెక్కివెక్కి ఏడ్చేడు. రాజబాబుకోసం బెడ్ కాఫీ పట్టుకుని అప్పుడే వచ్చిన పద్మావతి అతని ఏడ్పుచూసి ఆశ్చర్యచకితురాలైంది.

"అదేవిటి రాజూ! పొద్దున్నే ... ఆసలేవయింది!" అని ఆర్ద్రంగా అతన్ని అక్కున చేర్చుకుంది.

"వదినా! ఇంకెప్పుడూ పిచ్చిపిచ్చి సినిమాలు చూడను. ఇంకెప్పుడూ పశువులా ప్రవర్తించను. నన్ను క్షమించు.... వదినా...." అంటూ బావురుమన్న రాజబాబుని చూసి అసలు సంగతి అర్థంకాక తెల్లబోయింది పద్మావతి!

—೦೦೦—

ప్రస్తుతం చలామణీలోవున్న మతాలు - మోజెస్, క్రీస్తు, మహమ్మద్ మొదలయిన వారందరి మతాల్ని నేను నిరాకరిస్తాను. మానవుల్లో పరస్పర విద్వేషాల్ని పెంపొందించి, అసహనాన్నిలభివృద్ధి పరచడమేగాక బయట ఎక్కడో వున్నాయనుకొనే ఏవో శక్తులకు మానవుడ్ని బానిసగా చేస్తున్నాయి. ఈ భ్రాంతులు నాశనంకావాలి. అప్పుడే పరస్పర వైరుద్ధ్యాలు లేకుండా సామరస్యంతో తన సర్వశక్తులనూ అభివృద్ధిపరచుకుంటూ తోటి మానవులు అభివృద్ధి చెందడానికి తోడ్పడే నూతన మానవుడు జన్మిస్తాడు.

—మాక్సిం గోర్కీ

808